క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. విద్యానగర్ ఫీడర్ పరిధిలో విద్యానగర్, అడిక్‌మెట్, బ్లాక్‌బ్యాంక్, వడ్డెర బస్తీ, ఎస్ఆర్టీ క్వార్టర్స్‌లో 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, డీడీహెచ్ ఫీడర్ పరిధిలో విజ్ఞానపురి కాలనీ, వీఎస్టీ మెయిన్ రోడ్డు, దయానంద్‌నగర్, ఎస్ఆర్టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 12 గంటల నుంచి 2 గంటల వరకు, హరాజ్‌పెంట ఫీడర్ పరిధిలో సుందర్‌నగర్, శ్యామ్‌నగర్, క్రిమిటోరియం, వైఎంసీఏ ఫీడర్ పరిధిలో బ్లడ్‌బ్యాంక్, వాటర్‌వర్క్స్, రాఘవేంద్ర స్వామి దేవాలయం , పోలీస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు, నెహ్రూనగర్ ఫీడర్ పరిధిలో నెహ్రూనగర్, కృష్ణానగర్, గోల్నాక చర్చ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

బీసీలకు సీఎం.. ఎస్సీ, ఎస్టీలకు డిప్యూటీ సీఎం ప్రకటించాలి

ముషీరాబాద్: రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు సీఎం, ఎస్సీ, ఎస్టీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆ పార్టీలకే వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం గెలిచే సీట్లు ప్రకటించాలన్నారు. కామన్ సివిల్ కోడ్‌ను వ్యతిరేకిస్తున్న సీఎం కేసీఆర్ క్రిమినల్ ప్రొసీజర్ కోర్డుకు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. సీబీఐని రాష్ట్రంలోకి అనుమతించకుండా తీర్మానించిన ప్రభుత్వానికి సీసీసీపై మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. సీసీసీ అమలుకు శరవేగంతో కృషి చేస్తున్న కేంద్రం కేసీఆర్ అడ్డుపడుతుంటే ఎందుకు తగిన చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నించారు. బీసీ సంఘం నాయకులు సుధాకర్‌ముదిరాజ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, అంజి, సతీష్ పాల్గొన్నారు.

మన సంస్కృతిని చాటిచెప్పే పండుగ బోనాలు



చిక్కడపల్లి: మన సంస్కృతిని చాటి చెప్పే పండుగ ఆషాఢ బోనాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ జవహర్‌నగర్‌లోని వరాల పోచమ్మ దేవాలయం 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్‌లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ఏడాది బోనాలకు ప్రభుత్వం రూ.15 కోట్లు విడుదల చేసిందన్నారు. వారం రోజుల ముందే నియోజవర్గ పరిధిలోని ఆలయాలకు నిర్వాహకులకు ఆర్థికసాయాన్ని అదించామన్నారు. పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, ముఠానరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, గడ్డమీది శ్రీనివాస్, బీజేపీ నగర నాయకులు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, అరుణ్‌కుమార్, ఆకుల అభిషేక్, ఆలయ చైర్మన్ సీహెచ్. నిరంజన్, అధ్యక్షుడు ఎ.కనకరాజు, ప్రధాన కార్యదర్శి యేసురత్నం, కోశాధికారి శ్రీరాములు, గణేశ్, ఎం.కొమురయ్య, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: ఓ వ్యక్తి కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (55) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడుపరాదు

చిక్కడపల్లి: మద్యం సేవించి వాహనాలు నడుపరాదని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆకుల సతీష్ హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని ఈ ఘటనల్లో వారితో పాటు ఇతరులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి మూడురోజుల జైలు శిక్ష, జరిమానా , 20మందికి రూ.2100 చొప్పున జరిమానాను నాంపల్లి 10ఎంఎం కోర్టు జడ్జి విధించినట్లు ఆయన బుధవారం వివరించారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలి



చిక్కడపల్లి ఏసీపీ ఎ.యాదగిరి

చిక్కడపల్లి: బోనాల పండుగ సందర్భంగా ఉత్సవాలను ఆయా ఆలయాల నిర్వాహకులు త్వరగా మొదలుపెట్టి రాత్రి 9 గంటల కల్లా ముగించాలని ప్రశాంత వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని చిక్కడపల్లి లా అండ్ ఆర్డర్ పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ, గాంధీనగర్ ఇన్‌చార్జి ఏసీపీ ఎ.యాదగిరి సూచించారు.

- ఈ నెల 16,17 తేదీల్లో సబ్‌డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్, గాంధీనగర్, దోమలగూడ, సెక్రటేరియేట్ పీఎస్‌ల పరిధుల్లో నిర్వహించుకునే ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.
- బోనాల పండుగ సందర్భంగా విస్తృతమైన బందోబస్తు చర్యలు చేపడుతున్నామని ఎలాంటి చిన్న సంఘటన జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.
- లోయర్‌ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ ఆలయం వద్ద సబ్ డివిజన్‌ల పరిధిలోని ఆలయాల వారే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు కూడా అమ్మవారిని దర్శించుకుంటారని వివరించారు.
- ఈ నేపథ్యంలోనే బోనాలు తీసుకొచ్చే మహిళలకు ఎలాంటి ఆటంకం లేకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపడతామని సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం నిఘా ఏర్పాటు చేశామన్నారు.
- బోనాల వేడుకల సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా డీజేలు పెడితే వారిపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.
- ఫలహారబండ్ల ఊరేగింపులు నిర్ణీత సమయంలోపు తీయాలని, మొత్తంగా సబ్ డివిజన్‌ల పరిధిలో మూడు భారీ తొట్టెల, ఫలహారబండ్ల ఊరేగింపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు.
- ప్రశాంతంగా ఉత్సవాలు, ఊరేగింపులు జరిగేలా ప్రజలు, అమ్మవారి ఆలయాల నిర్వాహకుల సహకారం తీసుకుంటున్నామని ఎవరూ.. డ్రోన్ కెమెరాలు వాడొద్దని ఏసీపీ యాదగిరి సూచించారు.
- సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని ఆయన తెలిపారు. పోలీస్‌స్టేషన్‌ల సిబ్బందితో పాటు అదనంగా సిబ్బంది బందోబస్తులో ఉంటారు.
- మొత్తంగా 500 మంది సిబ్బంది అనుక్షణం బోనాల సందర్భంగా రెండు రోజులపాటు బందోబస్తు చర్యల్లో పాల్గొని ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీ నేత సంతోష్ మృతిపై ప్రముఖుల నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు బండారు సంతోష్ కుమార్ బుధవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. సంతోష్‌కుమార్ (50) కు గుండె నొప్పి రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు కాచిగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకురాగా.. చికిత్స అందిస్తుండగానే ఆయన మృతి చెందారు. గత 30 ఏళ్లుగా పార్టీకి అంకితభావంతో కృషి చేస్తున్నారని మంచి వ్యక్తిగా ఆయనకు పేరుందని స్థానికులు వాపోయారు. మూడుసార్లు కాచిగూడ డివిజన్ అధ్యక్షుడిగా డివిజన్ కార్పొరేటర్ గెలుపునకు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన పార్థివదేహానికి నివాసం వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, పద్మావెంకట్‌రెడ్డి, వై.అమృత, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, నేతలు వెంకట్‌రెడ్డి, కన్నె రమేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, సుభాష్ పటేల్, కేసరి నర్సింగ్‌యాదవ్, భీమ్‌రాజ్, కృష్ణాగౌడ్, బల్వీర్ తదితరులు నివాళులర్పించారు.

గవర్నర్ దత్తాత్రేయ సంతాపం..

కాచిగూడ: బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు బండారి సంతోష్ అకాల మరణం పట్ల దిగ్భ్రాంతిని కలిగించిందని ఇది ఎప్పుడూ.. ఊహించని వార్త అని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. తాను కేంద్రమంత్రిగా ప్రాతినిధ్యం వహించినప్పుడు తన దృష్టికి అనేక సమస్యలు తీసుకొచ్చి ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. ఆయన మృతిపట్ల తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ.. వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలన్నారు.

నల్లకుంట: బీజేపీ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ అకాల మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. సురేష్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతిని తెలియజేశారు.

ధర్మారావుకు ‘తానా’లో ఘన సత్కారం



కాచిగూడ: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఆధ్వర్యంలో సాంస్కృతిక రంగంలో అంతర్జాతీయ వ్యాప్తంగా విశేష సేవలందిస్తున్న సంస్కృతి రత్న డాక్టర్ కె.ధర్మారావుకు తానా మహాసభలో ఘన సత్కారం జరిగింది. తానా 23వ వార్షిక మహాసభలను పురస్కరించుకుని అమెరికాలోని ఫిలడెల్ఫియా పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి బర్కత్‌పురకు చెందిన ధర్మారావుకు ఆహ్వానం అందింది. తానా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండ్ల హనుమయ్య, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ చౌదరి జంపాల, డాక్టర్ ప్రసాద్ తోటకూర తదితరులు హాజరై ఆయనను సత్కరించి అభినందించారు. అమెరికా తెలుగు ప్రముఖులు డాక్టర్ ప్రసాద్ తోటకూర నేతృత్వంలో వివిధ దేశాల సాహితీవేత్తల సమక్షంలో ‘సిరివెన్నెల సమగ్ర సాహిత్య సమాలోచన’ నిర్వహించారు. ఇలాంటి విశ్వవేదికపై తనను ఆహ్వానించి, సత్కరించడంపై ధర్మారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తానా నిర్వహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇట్‌క్లా సంస్థ అమెరికా సందాన కర్త కేఎస్ మూర్తి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు

ముషీరాబాద్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైనట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అనిల్ ప్రకటించారు. బుధవారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు తరగతులను బహిష్కరించి ర్యాలీలు, రాస్తారోకో, ధర్నాలు, కలెక్టర్ కార్యాలయాల ముట్టడి వంటి కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పించారన్నారు. హైదరాబాద్‌లో మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి ప్రయత్నించగా.. పోలీసులు బలవంతంగా విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేశారన్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావేంజర్స్ పోస్టుల భర్తీ చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించి కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఒకేసారి డీఎస్‌ఈ నిర్వహించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య నినాదం మాటలకే పరిమితమైందని ఎద్దేవ చేశారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కె.ప్రవీణ్‌కుమార్, తిరుపతి, పవిత్ర, సాయిప్రసాద్, నవీన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ: హిమాయత్‌నగర్ మండల పరిధిలోని కాచిగూడ, నారాయణగూడ, హిమాయత్‌నగర్, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లోని పలు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. హైదర్‌గూడలోని సెయింట్ పాల్స్ స్కూల్ మాత్రం తరగతులు నిర్వహించడంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. నారాయణగూడ పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.

ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించాలని ధర్నా



హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు తరలివెళ్తున్న మున్నూరుకాపులు

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ పరిధి నుంచి తొలగించి మున్నూరు కాపులకు అప్పగించాలని మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్‌పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్నూరుకాపుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం ‘మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన’ ఆధ్వర్యంలో ‘చలో హైదరాబాద్, కలెక్టరేట్’ కార్యక్రమం నిర్వహించారు. కాచిగూడ నుంచి కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం శ్రీనివాస్‌పటేల్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇందిరాపార్క్ వద్ద మున్నూరుకాపులు నిర్వహించిన ధర్నాలో ప్రస్తుత సీఎం కేసీఆర్ అండగా ఉంటానని అప్పట్లో హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లు అవుతున్నా.. ప్రస్తుతం మున్నూరుకాపుల సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. మున్నూరుకాపుల సంక్షేమం, అభివృద్ధికి రూ.5 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న మున్నూరుకాపులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. చట్టసభల్లో, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో 30శాతం పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కటికం మహేష్, బత్తుల రాములు, సుధ, వసుంధర, సందీప్, మన్నె వెంకటేష్, శ్రీనివాస్, బాలరాజు, బాయికాడి సాయిలు, కల్లూరి నరహరి, గర్రపల్లి గణేష్, గడ్డం అనిల్, పత్తి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్‌భవన్ ఎదుట మహాధర్నా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈ నెల 13న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ (డీఎస్‌డీ) ఆధ్వర్యంలో బదిరులు, దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ ప్రయాణ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తూ.. బస్ భవన్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని డీఎస్‌డీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, జాతీయ కో–ఆర్డినేటర్ కె.వెంకటేష్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. సీటీబస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. గురువారం జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆలోచనలు విజయానికి సోపానాలు..



విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కాలర్ షిప్స్ పంపిణీ చేస్తున్న బొగ్గారపు సూర్య ప్రకాష్‌రావు

కాచిగూడ: ఆత్మవిశ్వాసంతో చేసే మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ బొగ్గారపు సూర్య ప్రకాష్‌రావు అన్నారు. బుధవారం కాచిగూడలోని వైశ్య హాస్టల్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కాలర్‌షిప్స్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పంపిణీ చేశారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థి దశలోనే తమకు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎదురయ్యే అవరోధాలను అధిగమించి విజయాలు సాధించేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైశ్యహాస్టల్ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ చల్లా సోమరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ధనుంజయ్, కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కోశాధికారి రఘువీర్, జ్ఞాన్‌చందర్, ఉప్పాల రాజేశ్వర్, పబ్బతి రవిప్రసన్న కుమార్, కొత్తూరు జయప్రకాష్‌రామ్, జయరాములుగుప్తా, మ్యాడం దయాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

కాచిగూడ: వైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి వాసవీ సేవా కేంద్రం మాజీ అధ్యక్షుడు చల్లా సోమ్‌రాజ్‌రామ్ సేవలు చిరస్మరణీయమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ అన్నారు. సోమ్‌రాజ్‌రామ్ 94వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పలువురు వైశ్య ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేదలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు, వృద్ధాప్య పెన్షన్లు అందజేశారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్, చల్లా ప్రసన్న, చల్లా సంజయ్, ఆలంపల్లి రవికుమార్, రాజశేఖర్ గుప్తా, కె.రమేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్ తదితరులు

రూ.400 కోట్ల నిధుల విడుదల చరిత్రాత్మకం



కొండూరు సత్యనారాయణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీ కులవృత్తులకు లక్ష రూపాయల ఆర్థికసాయం కోసం రూ.400 కోట్ల నిధులు విడుదల చేయడం చరిత్రాత్మకమని తెలంగాణలోని బీసీ కులవృత్తులంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వందశాతం సబ్సిడీతో బీసీ కులవృత్తులను ఆదుకోవాలనే ఉద్దేశంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రతి నెల 15 న నియోజకవర్గాల వారీగా బీసీ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు, ఎంబీసీ, సంచార జాతుల వారికి ప్రాధాన్యత క్రమంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇలాంటి నిర్ణయం తీసుకున్న సీఎంకు కులవృత్తుల వారు రుణపడి ఉంటారన్నారు.

అధికారులు సమన్వయ సహకారం అందించాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: బోనాల పండుగ సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయ సహకారం అందించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ పేర్కొన్నారు. బోనాల పండుగకు అన్ని శాఖల అధికారులతో పండుగ నిర్వహణ సమీక్ష బుధవారం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో కార్పొరేటర్ నిర్వహించారు. జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య, ఎంటమాలజీ, ఎలక్ట్రికల్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ విభాగం, విద్యుత్‌శాఖ తదితర పలుశాఖల అధికారులతో ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో ఉన్న అన్ని అమ్మవార్ల దేవాలయాల వద్ద 15, 16, 17, 18 తేదీల్లో అధికారులు, వారి సిబ్బంది పూర్తి సమన్వయంతో సహకారాన్ని తమ బాధ్యతగా నిర్వర్తించాలని కోరారు. బోనాలతో దేవాలయాలకు వచ్చే మహిళలు, ఫలహారం బండ్ల నిర్వాహకులు, దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయాల వద్ద రోడ్డు ప్యాచ్‌వర్క్స్ శానిటైజేషన్ చేపట్టాలని సూచించారు. విద్యుత్‌దీపాల అలంకరణకు విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు సహకరించాలని కోరారు. ఏఎంహెచ్ఓ మైత్రేయి, ఎలక్ట్రికల్ డీఈఈ వెంకటరమణ, ఏఈ జ్యోతిర్మయి, ఇంజినీరింగ్ డీఈఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ మహేష్, వాటర్ బోర్డు మేనేజర్ కృష్ణమోహన్, ఇన్‌స్పెక్టర్ శంకర్, ట్రాఫిక్ ఎస్సై సుబ్బారావు, సచిన్‌కుమార్, బీజేపీ నేతలు వినయ్‌కుమార్ తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి



రాంనగర్ చౌరస్తాలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆధ్వర్యంలో..



ఫీవర్ చౌరస్తాలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ముషీరాబాద్: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటల కరెంటు అవసరం లేదని మూడు గంటలు ఇస్తే సరిపోతుందని చెప్పడం సరికాదని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. 3 గంటల కరెంటు రైతులకు ఇస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా రాంనగర్ చౌరస్తాలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా, రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ లాంటి పథకాలను తుంగలో తొక్కుతుందని దానిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రావులపాటి మోజెస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, మాధవ్, శ్యామ్‌సుందర్, దీన్‌దయాల్‌రెడ్డి, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్ ప్రసాద్, మన్నె దామోదర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, శేఖర్, రావుల శ్రీకాంత్, ఉమారాణి, శ్రీధర్‌చారి తదితరులున్నారు.

నల్లకుంట: రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే కాలేరు ఆధ్వర్యంలో బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టి రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని రైతుల అభివృద్ధిని జీర్ణించుకోలేని రేవంత్‌రెడ్డి 24 గంటల విద్యుత్ అవసరం లేదని చెప్పారని విమర్శించారు. గత కాంగ్రెస్ పాలనలో కరెంటు ఎప్పుడు వస్తుందో లేదో.. తెలియని అయోమయ స్థితిలో రైతులు బోరు బావుల వద్ద కాపలాకాసి ఎన్నో కష్టాలు పడ్డారని గుర్తు చేశారు. కాగా రైతు పక్షపాతి సీఎం కేసీఆర్ సహృదయంతో రైతులకు నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గెల్వయ్య, మేడి ప్రసాద్, గాలపల్లి శంకర్, భాస్కర్‌గౌడ్ బీఆర్ఎస్ నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అంబర్‌పేట: టీపీసీసీ అధ్యక్షుడు రైతులకు ఉచిత విద్యుత్‌పై చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం అంబర్‌పేట నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఛే నంబరు చౌరస్తాలో బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. మాజీ కార్పొరేటర్ పులి జగన్, నాయకులు నగేష్‌గౌడ్, మురళీకృష్ణ, విజితారెడ్డి, జనార్దన్ తదితరులున్నారు.

బాగ్‌అంబర్‌పేటలో...

- మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీనివాస్‌యాదవ్, హబీబ్, అంజి, మహేందర్ తదితరులున్నారు.

కవాడిగూడ: రైతాంగాన్ని చిన్న చూపు చూస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బేషరత్తుగా రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రైతులు తెలంగాణలో తిరగనివ్వరని హెచ్చరించారు.

రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించారు : అంజన్‌కుమార్‌యాదవ్



మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు

ముషీరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విద్యుత్‌పై మాట్లాడిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు వక్రీకరించి ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మాజీ ఎంపీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం ముషీరాబాద్ కాంగ్రెస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం ముషీరాబాద్‌లోని ఐషా ఫంక్షన్‌హాల్‌లో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని, రైతుల సంక్షేమానికి తమ పార్టీ అధినేత పోరాడుతుంటే బీఆర్ఎస్ నాయకులు తమ రాజకీయ లబ్ధికోసం రేవంత్‌రెడ్డిపై తప్పుడు విమర్శలు చేస్తూ.. రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీల మాటలు నమ్మవద్దని సూచించారు.

బలమైన శక్తిగా కాంగ్రెస్..

రోజురోజుకు కాంగ్రెస్ బలమైన శక్తిగా మారుతుండటంతో దీన్ని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌యాదవ్, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ఆర్ఎల్ రమేష్, పట్నం నాగభూషణంగౌడ్, జనిగే శ్రీనివాస్‌యాదవ్, చారి, వెంకట్, లింగంగుప్తా, గౌస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.